క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. భవానీనగర్, కల్యాణి ఫంక్షన్ హాల్, హౌజింగ్ బోర్డు ప్రాంతంలో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు, మడికొండలోని టీఎన్జీవోస్ కాలనీ, మెట్టుగుట్ట, ఖండాల దాబా ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, హనుమకొండలోని సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30వరకు, మైత్రినగర్, రజక సంఘం భవనం ప్రాంతాల్లో మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. దేశాయిపేట, బాలాజీనగర్ జంక్షన్, ఎంహెచ్.నగర్, లెనిన్ నగర్, వీవర్స్ కాలనీ, ఏనుమాముల, నజ్రత్ పుర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, కాశిబుగ్గ ఫీడర్‌లోని లక్ష్మీగణపతి కాలనీ, సాయిగణేష్ కాలనీ, వివేకానంద కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు చెన్నకేశవ స్వామి కల్యాణం

మడికొండ: మడికొండలోని శివకేశవ ఆలయంలో శనివారం చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 4గంటలకు మేలుకొలుపు, మంగళ వాయిద్యాలు, 5గంటలకు అభిషేకం, 10.30 గంటలకు కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 2గంటలకు ప్రసాద వితరణ, రాత్రి 11గంటలకు ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

చెక్కు అందజేత



కాజీపేట రూరల్: విద్యుదాఘాతంతో కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టకు చెందిన సింగారపు పలనికుమార్ మృతిచెందారు. ఈమేరకు విద్యుత్‌శాఖ మంజూరు చేసిన రూ.4.50 లక్షల విలువగల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బోడగుట్టలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతం అయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, చుంచు అశోక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బాటనీ విభాగం పరిశోధకురాలు యాట్ల స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇన్‌విట్రో క్లోనల్ ప్రాపగేషన్ అండ్ జెనిటిక్ ఫెడిలిటీ ఇన్ సెమీకార్పస్ అనకార్డియం ఎల్ఎఫ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. బాటనీ విభాగం ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. స్రవంతి.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతానికి చెందినవారు.

ఓయూ నుంచి కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..



విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బూరుగు శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎఫెక్ట్ ఆఫ్ బిస్మత్ ఆక్సైడ్ / లెడ్ ఆక్సైడ్ / అల్యూమినియం ఆక్సైడ్ ఆఫ్ ఫిజికల్ ఆప్టికల్ స్ట్రక్చరల్ అండ్ షీల్డింగ్ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్ కాడ్మియం బోరెట్ గ్లాసెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయూలోని ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ హిమబిందు పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

మరో పెళ్లి చేసుకున్న మహిళా కార్పొరేటర్ భర్త...?

వరంగల్: నగరంలోని ఓ డివిజన్ మహిళా కార్పొరేటర్ భర్త మరో పెళ్లి చేసుకున్నాడంటూ వాట్సప్ గ్రూపుల్లో వార్త శుక్రవారం వైరల్ అయింది. తనను మోసం చేశాడంటూ సదరు కార్పొరేటర్ భర్తపై ఒక యువతి గతంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ కేసులో రాజీకోసం యత్నించగా ఆ యువతితో సయోధ్య కుదరలేదు. దాంతో విసుగు చెందిన కార్పొరేటర్.. తన భర్త నుంచి విడాకులు కోరగా, వేరే యువతితో ఆ వ్యక్తికి పెళ్లి జరిగిందన్న వార్త వైరల్ అయింది. ఈ విషయమై ఆరాతీయగా సదరు కార్పొరేటర్ కొట్టిపారేశారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. వాస్తవాలు తెలియాల్సి ఉంది.

ఎస్సీ వర్గీకరణే నిజమైన నివాళి

హన్మకొండ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించడమే మాదిగ అమరులకు నిజమైన నివాళి అని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ జాతి అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన వీరులు ఎల్లప్పుడూ మాదిగ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల సూరన్న కాపు, జన్ను దినేష్, మంద రాజు, బండారి సురేందర్, మంద చిన్న రాజు, చేతల్ల శివ, రేణుకుంట్ల ఉమ మహేష్, అక్కనకుంట వెంకటస్వామి, రాజారపు కిరణ్, జేరిపోతుల సారంగపాణి, మంద వర్ధన్, క్రాంతి మాదిగ, కిరణ్ పాల్గొన్నారు.



హన్మకొండ: మాదిగ అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో..

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమర వీరులకు ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, నాయకులు మేడ స్వామి, దేవరకొండ సదానందం, సిలివేరు సుధాకర్, జన్ను సంజీవ్, కొడవటి తిరుపతి, అనిల్ కుమార్, అరూరి రాకేష్, మహేందర్, సుదన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేవరకు పోరాటం

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని, వర్గీకరణ పోరులో అమరుల త్యాగాలు మరువబోమని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిమాదిగ అన్నారు. అసువులు బాసిన మాదిగ అమర వీరులకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళి, బాధ్యులు హరీష్, శ్రీకాంత్, ప్రణయ్‌కుమార్, జనార్దన్, కోయడ సుకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటే ఒక నమ్మకం

కాజీపేట రూరల్: కాంగ్రెస్ పార్టీ అంటే ఒక నమ్మకమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట దర్గా రోడ్డులో గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సర్తాజ్‌బేగం, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, అధికారులు సీజీఎం కిషన్, టౌన్ డీఈ నవీన్‌కుమార్, ఎస్ఏఓ సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, ఏటీఈ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.అమర్, సింగారపు రవిప్రసాద్, ఎం.రేణు, ఎల్.శ్రీనివాస్, ఎల్.రవి, ఇంతియాజ్, తాళ్ల సతీష్, శ్రీనివాస్, ఎల్.కుమారస్వామి, మంద శివ, తదితరులు పాల్గొన్నారు.



గృహజ్యోతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

61వ డివిజన్ వడ్డెపల్లి 100ఫీట్ రోడ్డులో లోటస్ అపార్ట్‌మెంట్ ఎదురుగా రూ.1 కోటి రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రెయినేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీ మేరకు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గజపాక రమేష్, నాయకులు సాగరిక రావు, గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, ఎ.నాగరాజు, బంక సంపత్‌యాదవ్, తాళ్లపల్లి సుధాకర్, పున్నం, మల్లారెడ్డి, కట్ట రఘుపాల్‌రెడ్డి, అభినవ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పో

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మన అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పోను మార్కెట్ కమిటీ సెక్రటరీ సంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని, ఉమ్మడి వరంగల్ జిల్లా అన్ని పంటలకు నిలయమని కొనియాడారు. నూతన టెక్నాలజీ, మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా సైన్స్ అండ్ టెక్నాలజీని ఉపయోగించుకుని తక్కువ శ్రమతో ఎక్కువ పనిచేస్తూ మంచి ఆదాయాన్ని గడించాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అనేక సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించేందుకు స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పో నిర్వహించినట్లు మన అగ్రిటెక్ ఎండీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ పరికరాల ఉత్పత్తుల ప్రతినిధులు, మన అగ్రిటెక్ సంస్థ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మెగా ఎక్స్‌పోకు హాజరైన రైతులు, వ్యాపారులు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై హర్షం



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆలువాల కార్తీక్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ గేట్‌వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, మరిన్ని పోస్టులను కలిపి 11,062 టీచర్ పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా వినయ్‌కుమార్, సెహ్వాగ్, రాహుల్‌వర్ధన్, దారావత్ మహేష్, ఎండీ.ప్యాయజ్, విద్యార్థులు రంజిత్, రమేష్, వరుణ్, కమ్రోజు, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

విద్యారణ్యపురి: పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ కులాలకు చెందిన అభ్యర్థులు హనుమకొండలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లో టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 10న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించి ఉచితంగా కోచింగ్ ఇస్తారని, ఉచిత వసతి, భోజనం కూడా ఉంటుందని ఎస్సీ స్టడీ సర్కిల్ గౌరవ సంచాలకులు డాక్టర్ జగన్‌మోహన్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, మధు, డాక్టర్ చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తపాలా ఉద్యోగుల మహాసభలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నయీంనగర్: రెండేళ్లకోసారి నిర్వహించనున్న అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల జాతీయ మహాసభలను కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాసలో ఈనెల 2, 3, 4వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం జనరల్ సెక్రటరీ బొద్దున వెంకటేశ్వర్లు, కన్వీనర్ కర్రా యాదవరెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాసభలకు దేశ నలుమూలల నుంచి సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కనీస వేతనాలు, కనీస సౌకర్యాల కోసం సభలో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, జనార్దన్, మర్రి కొమురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కాంట్రాక్టు అధ్యాపకులుగా గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీకి కేయూలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, బాధ్యులు నరేందర్‌నాయక్, దేవోజీనాయక్, తిరుణహరి శేషు, రమేష్, లక్ష్మీనారాయణ, మాధవి, రమాదేవి, నవీన్, సదానందం, నాయిని వినీత, భిక్షపతి, నవీన్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఖిలా వరంగల్: పేదల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం 17వ డివిజన్ బొల్లికుంటలో తహసీల్దార్ బండి నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని వివరించారు. అర్హులందరూ సర్కారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరి లబ్ధి చేకూరుతుందని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ గద్దె బాబు, కాంగ్రెస్ నేత గన్నోజు శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కేటీఆర్‌కు ఘన స్వాగతం

హసన్‌పర్తి: బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు నాయకులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ పరిశీలనకు వెళ్తున్న సందర్భంగా యాదాద్రి - ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని వంగపహాడ్ వద్ద కేటీఆర్‌ఎస్‌కు బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి స్వాగతం పలికారు. నాగుర్ల వెంకటేశ్వర్లు, రాకేష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మణిందర్ నాథ్, ఎల్లావుల లలితాయాదవ్, దోమ కుమార్, జంగా కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు పాటుపడాలి

ఖిలా వరంగల్: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ప్రొఫెసర్ నర్సింహారావు సూచించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనలో ఫార్మసిస్టుల పాత్ర, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సును ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి తెలుసుకుని ఆ మహమ్మారిని నివారించేందుకు కృషి చేయాలని అన్నారు. ఎయిడ్స్ మహమ్మారికి మందులేదని, నివారణే మార్గమని వివరించారు. కార్యక్రమంలో డీన్ శర్మ, కళాశాల ప్రిన్సిపాల్ కమల్‌యాదవ్, జి.రమేష్, ఐసీటీసీ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

మంత్రి సురేఖను కలిసిన నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హనుమకొండలోని ఆమె నివాసంలో టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం కలిశారు. ఈనెల 6న హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని కోరారు. సంఘం కార్యదర్శి సోమయ్య, కోశాధికారి పణికర రాజేష్, సహాధ్యక్షుడు పులూరు వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు శనిగరపు శ్యాంసుందర్, భూక్య రాము, రాజేష్‌ఖన్నా, మోయిజ్, లక్ష్మీప్రసాద్, పృథ్వీ, నవీన్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎయిడెడ్ టీచర్ల క్యాలెండర్ ఆవిష్కరణ

న్యూశాయంపేట: ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ నజీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి గీతాంజలి, జేఏసీ కన్వీనర్ మహ్మద్ అబ్దుల్ ఖాలిక్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలి

హన్మకొండ కల్చరల్: ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని వేయిస్తంభాల దేవాలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ కోరారు. ఈమేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం కలిసి ఉత్సవాల పత్రికను అందజేసి ఆహ్వానించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జ్యోతి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జ్యోతి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవి, మాధవి, ప్రొఫెసర్ హనుమంతు, అధ్యాపకులు ఉష, శ్రీదేవి, శ్రీలత, రమేష్, మంద శ్రీనివాస్, చిర్ర రాజు, సరిత, ఆదిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా సోషియాలజీ విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ పుల్లా రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ పదవిలో బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ హనుమంతు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

సంక్షిప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



నయీంనగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేయడంలో ముందుండాలని ప్రొఫెసర్ శంకర్‌లింగం సూచించారు. హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్, మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బహుజన కులాలను అభివృద్ధి చేయాలి

నయీంనగర్: బహుజన కులాలను అభివృద్ధి చేయాలని తెలంగాణ బీసీ ఐక్య వేదిక బాధ్యుడు వేముల కృష్ణాకర్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పెండ్యాల బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ లక్ష్మీనగర్‌కు చెందిన పల్నాటి లక్ష్మీకాంత అనారోగ్య సమస్యలతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మాచర్ల రవీందర్, మెంతుల యాదగిరి, తదితరులు పరామర్శించారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పలు అక్రమాలు జరుగుతున్నాయని, వర్సిటీ అధ్యాపకులపై వివక్ష చూపుతున్న అధికారులపై చర్య తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) సభ్యులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి, బాధ్యులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో అకుట్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ సోమయ్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్ పద్మజ, డాక్టర్ మమత, డాక్టర్ శాయేద ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన పలువురు నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా ఆకుల శ్రీకాంత్, పొనగోటి వెంకట్‌రావు, తాటిరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు చేరగా, వారికి పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మెట్టుగుట్ట మాజీ చైర్మన్ దువ్వ నవీన్, బండ రాజు, ఎలకంటి సురేష్, కుక్కల రాకేష్, కొత్తకొండ రాకేష్, బల్సుకురి శ్రీను, కుక్కల రాజేంద్రప్రసాద్, గడ్డం మహేందర్, తదితరులు ఉన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్: బీజేపీ నేత మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే జయపాల్ సమక్షంలో 47వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కొత్త రవి, బింగి శ్రీనివాస్, ఉడుతల బాబురావు బీజేపీ చేరారు. ఈమేరకు విజయ సంకల్పయాత్రలో భాగంగా కాజీపేట బాపూజీనగర్ సెంటర్ వద్ద వారికి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: ఫోర్ట్‌రోడ్డు పై ఆకారం జంక్షన్ నుంచి వరంగల్‌కు వెళ్లే మార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో అతడు రోడ్డుపై పడిపోగా, స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుడు తన వివరాలు చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడు.

కాంట్రాక్టు అధ్యాపకుడి నియామకం హర్షణీయం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు అధ్యాపకుడిని నియమించడం హర్షణీయమని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (కుక్టా) డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ అన్నారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులు ఐదుగురు కాగా, కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులు 150మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో వారి సేవలను గుర్తించి కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు అధ్యాపకుడికి వీసీ తాటికొండ రమేష్ అవకాశం ఇచ్చారని ఆయన కొనియాడారు. సమావేశంలో కాంట్రాక్టు అధ్యాపకులు మామిడి లింగయ్య, సంజీవ్, దేవేంద్రచారి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్

‘వడుప్సా’ నుంచి పలువురి బహిష్కరణ



మాట్లాడుతున్న చల్లా నాగార్జునరెడ్డి

నయీంనగర్: హైదరాబాద్‌లో జరిగిన టీఆర్ఎస్ఎంఏ వడుప్సా రాష్ట్ర స్థాయి సమావేశంలో దుర్భాషలాడి, సమావేశాన్ని బహిష్కరించి అనుచితంగా ప్రవర్తించిన పలువురిని రాష్ట్ర కమిటీ బహిష్కరించిందని వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్‌రావు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ.శ్యామ్, ఎన్.వెంకటేశ్వర్‌రావు, కె.శ్రీధర్, ఏ.వీరాస్వామి, బి.రవి, కె.మోహన్, జ్ఞానేశ్వర్ సింగ్‌ను సంఘం నుంచి బహిష్కరించినట్లు వివరించారు. ఇకనుంచి వారికి సంఘానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. వారు సంఘం పేరు వాడుకోవడానికి వీలులేదన్నారు. సమావేశంలో బి.వెంకటేశ్వర్లు, కె.భూపాల్‌రావు, వి.రాధాకృష్ణ, కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్: ఫిబ్రవరి 21నుంచి 25వ తేదీ వరకు పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 41వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్.భవీల్య, కె.రవళి పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈమేరకు తెలంగాణ జట్టులో కీలకంగా వ్యవహరించిన ఆ క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాంబశివరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి తాబేటి రాజేందర్, డాక్టర్ రతన్‌సింగ్, రవీందర్‌గౌడ్, పీఈటీ అశోక్ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు